సమయాల్లో గుడికి వెళ్ళకుండా నువ్వేం చేస్తూంటావు?" ప్రశ్నించిందా దేవదూత.

"సాటి మనుషులకి, జీవాలకి సేవ చేయడంతో నాకు గుడికెళ్ళే తీరిక చిక్కదు." జవాబు చెప్పాడతను.

"అలాగా? ఐనా నీ పేరు చెప్పు. ఇందుల్లో ఉందేమో చూస్తాను." అడిగిందా దేవదూత మళ్ళీ.

అతను మొహమాట పడుతూనే తన పేరు చెప్పాడు. ఆమె పుస్తకంలోని పేర్లని చూసి వాటిలో అతని పేరు లేకపోవడంతో పెదవి విరిచి చెప్పింది.

"నువ్వు చెప్పింది నిజమే. వీటిలో నీ పేరు లేదు."

ఆమె దగ్గర శెలవు తీసుకుని అతను వెళ్తూండగా చెప్పిందా దేవదూత.

"నీ మొహం చూస్తూంటే నీ పేరు ఖచ్చితంగా వుండాలనిపిస్తోంది. ఆగు. ఇంకో పుస్తకం ఉంది. అందులో నీ పేరేమైనా ఉందేమో చూస్తాను."

మరో చిన్న పుస్తకం తీసి, దాన్ని తిరగేసింది. అందులోని పేర్ల జాబితాలో అన్నిటికన్నా పైనున్న అతని పేరుని చూపించింది.

"నా పేరు ఇందులో ఎందుకుంది? ఈ పుస్తకం ఏమిటి?" ప్రశ్నించాడు అతను.

"ఇది భగవంతుడు ప్రేమించేవారి పేర్లున్న పుస్తకం." చెప్పిందామె.

అతను విస్మయంగా చూస్తూంటే దేవదూత ఇలా వివరించింది.

"తన విగ్రహాన్ని ఆరాధించే వారికంటే, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేసేవారే భగవంతుడికి చాలా ప్రీతిపాత్రమైనవారు."

## 70. పారాయణం పుణ్యం

భగవద్గీత పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం పుణ్యం అని తెలిసిన ఓ భక్తుడు నిత్యం వేణుగోపాలస్వామి ఆలయంలో కూర్చుని

భగవద్గీతలోని ఓ అధ్యాయాన్ని, విష్ణు సహస్రనామాలని పారాయణం చేయసాగాడు. ఓ రాత్రి ఆ గుళ్ళో బస చేసిన ఓ సన్యాసి అతన్ని చూసి, అనేక ప్రశ్నలు వేసి, అతను అలా కొన్ని సంవత్సరాలుగా వాటిని పారాయణం చేస్తున్నాడని గ్రహించి అభినందించాడు. కొంత కాలం గడిచాక అతనో ఛోటా గురువు రాసిన ఓ ఆధ్యాత్మిక పుస్తకం చదవడం తటస్థించింది. అందులో పారాయణాన్ని ఖండిస్తూ ఇలా రాసాడాయన.

'మనలో చాలా మంది సంస్కృతం రాని కారణంగా అర్థాలు తెలీక, అనేక నామాలు, మంత్రాలు, శ్లోకాలు పారాయణం చేస్తూంటారు. దాంతో పిండిమర ఆడినట్లుగా వారి నోరు ఆడి బయటకి శబ్దం వస్తూంటుంది తప్ప, అందువల్ల వారికే పుణ్యం దక్కదు. అదే నిజమైతే ఈ పాటికి నిత్యం భక్తి గీతాలు ప్రసారం చేసే ప్రతీ రేడియోకి, టేప్ రికార్డర్‌కి ముక్తి కలిగి ఉండాలి.'

అది చదివి నిరుత్సాహ పడిన అతను సమయం, శ్రమ వృధా ఎందుకని పారాయణాన్ని ఆపేసాడు. గుళ్ళో దేవుడికి దణ్ణం పెట్టుకుని వెంటనే ఇంటికి వెళ్ళసాగాడు. అలా ఓ ఆర్నెల్లు గడిచాక ఓ సాయంత్రం అతను ఎప్పటిలా గుడికెళ్ళి దణ్ణం పెట్టుకుని వెళ్ళిపోతూంటే, ఆ గుళ్ళో బస చేసిన ఇదివరకటి సన్యాసి అతన్ని ఆపి ప్రశ్నించాడు.

"అదేమిటి? ఇవాళ భగవద్గీత, విష్ణు సహస్రనామాల పారాయణం చేయకుండానే వెళ్తున్నావేమిటి?"

"అర్థం తెలీకుండా భావరహితంగా వాటిని పారాయణం చేయడం నిరర్థకం కదా స్వామి. అందుచేత పారాయణం ఆపేసాను." వివరించాడు ఆ భక్తుడు.

"ఎవరు చెప్పారిది?"

"ఓ పుస్తకంలో చదివాను..."

ఆ సన్యాసి చిన్నగా నవ్వి అడిగాడు.

"నీకు జ్వరం వచ్చినప్పుడు డాక్టర్ ఇచ్చిన మందు ఏ ఫ్యాక్టరీలో తయారయ్యిందీ, అందులో ఏమేమి కలిపి ఎలా చేసారు అని తెలుసుకునే వేసుకుంటున్నావా?"

"లేదు స్వామి."

"అయినా అది పని చేస్తోందా లేక నీకు దాని గురించి తెలీదని పని చేయటం మానేస్తోందా?"

"పని చేస్తుంది స్వామి." జవాబు చెప్పాడా భక్తుడు.

"అలాగే, సాక్షాత్తు శ్రీకృష్ణుడి నోటి నుంచి వెలువడ్డ భగవద్గీత, భీష్ముడు చెప్పిన విష్ణు సహస్ర నామాలు భవరోగాలకి మందులు. డాక్టర్ ఇచ్చే మందు గురించిన ఎలాంటి జ్ఞానం మనకి లేకపోయినా అది మన మీద ఎలా పని చేస్తుందో, అలాగే వాటి ఉత్పత్తి, ప్రతిపదార్థాలు, సమాసాలు మొదలైనవేం మనకి తెలీకపోయినా, మనకి దక్కాల్సిన వాటి పారాయణ ఫలితం మనకి అందడం ఆగదు. భవ రోగాన్ని దాటించడానికి తయారైన ఈ శ్లోకాలు, మంత్రాలు అర్థం తెలీకపోయినా, నిప్పు కాలుతుందని తెలీక ముట్టుకున్నా కూడా చెయ్యి ఎలా కాలి తీరుతుందో అలా వాటి ఫలితాలని అవి ఇవ్వక మానవు.

అసలు అతనిచ్చిన పోలికే తప్పు. వాటిని ఉచ్చరించాలా, మానుకోవాలా అనే స్వయం నిర్ణయ శక్తి లేని పిండిమర, రేడియో, టేప్ రికార్డర్‌లు జీవంలేని జడ వస్తువులు. మనం జీవులం. పారాయణ ఉపయోగం జీవోద్ధరణకే."

వివరణతో కూడిన ఆ సమాధానం నచ్చడంతో అతను ఎప్పటిలా భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం తిరిగి ప్రారంభించాడు.